నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 24 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM


ఖమ్మం రూరల్ ఏవో ఆఫీస్‌లో ఏఈవోలకు ఫిర్యాదులు అందజేస్తున్న రైతులు (ఫైల్)

అసలే అదును రోజులు. అందునా మాంచి వ్యవసాయ సీజన్. పొద్దు పొద్దున్నే లేచి పొలం బాట పట్టే రైతులందరూ ఇప్పుడు రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. పరుగుపరుగున వెళ్లి పరపతి సంఘాల వద్ద బారులు తీరుతున్నారు. అక్కడ సరైనా సమాచారం లేకపోవడమో, రుణమాఫీ కాలేదన్న సమాధానం రావడమో జరగగానే.. అదే పరుగున వ్యవసాయ శాఖ కార్యాలయలకూ చేరుకుంటున్నారు. అక్కడా తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. అక్కడ సరైన సమాచారం దొరికిందా సరేసరి. లేదంటే అంతులేని ఆవేదన చెందుతున్నారు. తన సహజ నైజమైన ఓర్పును మరికొంత మూటగట్టుకొని, తనను తాను ఓదార్చుకొని, ఇంకొంత నిట్టూర్చుకొని మరో ప్రయత్నంగా ఇంకోసారి దరఖాస్తులు అందజేస్తున్నారు. 'మా పంట రుణాలను ఇప్పటికైనా ప్రభుత్వం మాఫీ చేయకపోతుందా?' అన్న ఆశతో, 'ఇప్పటికే సాగుకు అదును దాటిపోతుందే?' అన్న ఆవేదనతో వెనుదిరుగుతున్నారు.

**కానీ,**

వీరి ఓర్పునకు గానీ, నిట్టూర్పునకు గానీ ప్రభుత్వం పెద్దగా స్పందించిన దాఖలాలు ఎక్కడా కన్పించడం లేదు. చేస్తామన్న చేతలను, ఇచ్చిన గ్యారెంటీ హామీలను ఇప్పటికే పక్కనబెట్టింది. ఆపై ఇప్పటిదాకా మాటలతోనే నెట్టుకొచ్చిన ఈ ప్రభుత్వం.. ఇకపై ఈ అన్నదాతల ఆవేదనను ఆలకిస్తుందన్న ఆశ అనుమానంగానే కన్పిస్తోంది. అదునులో అరగంట ఆలస్యమైనా పంటల దిగుబడి తగ్గే ప్రమాదమున్నందున.. అర్ధ రాత్రిలోనూ అప్రమత్తంగా ఉండే అన్నదాతలు ఈ రుణమాఫీ పుణ్యమా అని అరిగోస పడుతున్నారు. ఇటు పంటల పదును అదునుమీద ఉన్న వేళ.. ఇటు పంట రుణాలు మాఫీ గాక హలధారులు అల్లాడుతున్న తీరుపై ప్రత్యేక కథనం..

*- ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 23*

- ఒక వైపు ఎవుసం పనులు.. మరో వైపు రుణమాఫీ తిప్పలు..
- పంటలను పక్కనబెట్టి రోజుల తరబడి బ్యాంకులకు పరుగులు
- వ్యవసాయ శాఖ కార్యాలయాల్లోనూ పోటెత్తుతున్న ఫిర్యాదులు
- రైతువేదికల్లో మరోసారి దరఖాస్తులు అందజేస్తున్న రైతులు
- ఇప్పటికే టోల్ ఫ్రీ, గ్రీవెన్స్, రైతువేదికల్లో వినతుల వెల్లువ

**ఖమ్మం జిల్లాలో బ్యాంకుల వారీగా పంట రుణాలు వివరాలు..**

| బ్యాంకు పేరు | రైతుల సంఖ్య | పంట రుణాలు (కోట్లలో) |
|---|---|---|
| బ్యాంకు ఆఫ్ బరోడా | 9,193 | రూ.119.2 |
| బ్యాంకు ఆఫ్ ఇండియా | 71 | 0.79 |
| బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర | 61 | రూ.1.93 |
| కెనరా బ్యాంకు | 27,560 | రూ.467.4 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 1,346 | రూ.7.28 |
| ఇండియన్ బ్యాంక్ | 6,722 | రూ.109.16 |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు | 4,865 | రూ.35.83 |
| పంజాబ్ నేషనల్ బ్యాంకు | 1,285 | రూ.34.27 |
| యూనియన్ బ్యాంకు | 44,504 | రూ.615.51 |
| యాక్సిస్ బ్యాంకు | 10,000 | రూ.104.36 |
| స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా | 64,105 | రూ.900.67 |
| బంధన్ బ్యాంకు | 02 | రూ.0.02 |
| సిటీ యూనియన్ బ్యాంకు | 720 | రూ.5.52 |
| డీసీబీ బ్యాంకు | 941 | రూ.30.31 |
| ధనలక్ష్మి బ్యాంకు | 734 | రూ.30.12 |
| ఫెడరల్ బ్యాంకు | 2,049 | రూ.40.15 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 199 | రూ.22.8 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 460 | రూ.35.18 |
| కర్ణాటక బ్యాంకు | 68 | రూ.1.76 |
| ఐడీబీఐ బ్యాంకు | 2,878 | రూ.71.83 |
| కరూర్ వైశ్యా బ్యాంకు | 1,754 | రూ.42.36 |
| సౌత్ ఇండియా బ్యాంకు | 550 | రూ.10.92 |
| ఏపీజీవీబీ | 83,804 | రూ.945.76 |
| డీసీసీబీ | 1,16,954 | రూ649.00 |
| డీబీఎస్ బ్యాంకు | 1,332 | రూ.25.27 |
| మొత్తం | 3,73,157 | రూ.4,307.58 |

# అన్నదాత అరిగోస

## పంటలు వదిలొచ్చి పరపతి సంఘాల్లో..

సాధారణంగా రాయితీ విత్తనాల కోసమో, పంటలకు ఎరువుల కోసమో, కొత్తగా పంట రుణాల కోసమో పరపతి సంఘాల వద్ద బారులు తీరి కన్పించే రైతులు.. ఇప్పుడు తమ పంట రుణాలు ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకునేందుకు గుంపులుగుంపులుగా కన్పిస్తున్నారు. జిల్లాలోని 76 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), బ్యాంకుల వద్ద కన్పిస్తున్న వారిలో సగం కంటే ఎక్కువమంది రైతులు.. పదును మీద ఉన్న తమ పంటలను వదిలి వచ్చిన వారే. ఈ కార్యాలయాల పనివేళలు ఉదయం 10 గంటలకు మొదలు కావాల్సి ఉన్నా కర్షకులు మాత్రం ఉదయం ఏడెనిమిది గంటల నుంచే క్యూలు కడుతున్నారు. రూ.లక్షలోపు, రూ.లక్షన్నరలోపు, రూ.2లక్షల్లోపు రుణాలను ఒకటి, రెండు, మూడు విడతల్లో మాఫీ చేస్తామంటూ ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి అన్ని విడతల కోసమూ ఆశగా ఎదురుచూశారు. ప్రతి విడతలోనూ కొద్ది మంది రైతులకే రుణమాఫీ అవుతూ వచ్చింది. మూడు విడతలూ ముగిసే సరికి మాఫీ కానివారే మిక్కిలిగా ఉన్నారు. దీంతో వారంతా వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లి మరోసారి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. కన్పించిన ప్రతి అధికారినీ కలిసి కన్నీటిపర్యంతమవుతున్నారు. తన పంట రుణం మాఫీ అయ్యేలా చూడాలంటూ వేడుకుంటున్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ఇప్పటికే రైతువేదికల వద్ద ఏఈవోలకు దరఖాస్తులు అందిస్తున్నారు. ప్రజావాణిలో వినతులూ సమర్పిస్తున్నారు. ఇక జిల్లాలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నెంబర్‌కు ఏకంగా పదివేలకు పైగానే ఫిర్యాదులు అందినట్లు సమాచారం ఉంటున్నదంటే అన్నదాతల ఆక్రందన ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. తాజాగా మరోసారి రెండు రోజుల నుంచి ప్రత్యేక ఫార్మాట్‌లో ప్రభుత్వం తయారు చేసిన దరఖాస్తు ఫారాలను మండల వ్యవసాయశాఖ అధికారులకు అందజేస్తున్నారు. అయితే, పలు దఫాలుగా ఫిర్యాదులు అందజేసినా తమకు ఎక్కడా కచ్చితమైన సమాచారం అందడం లేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎక్కడ తిరిగినా సక్కగా సమాధానం చెప్పడం లేదు



రుణమాఫీ వచ్చిందో రాలేదో తెలుసుకునేందుకు దాదాపు నెల రోజుల్నుంచి తిరుగుతున్నాను. ఏదులాపురం సొసైటీలో రూ.46 వేలు, కెనరా బ్యాంకులో మరో రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నాను. రూ.2 లక్షలకు పైబడి పంట రుణం తీసుకున్నా. ఆ పైబడిన నగదును బ్యాంకులో కట్టాలని మా ఊరు వాళ్లు చెబితే రోజూ వచ్చి అధికారులను అడుతున్నాను. సొసైటీలో కట్టాలా? బ్యాంకులో కట్టాలా? అని అడిగిన ప్రతిసారీ కొద్దిరోజులు ఆగమని చెబుతున్నారు. ఎక్కడ కట్టాలో, ఎంత కట్టాలో చెప్పడం లేదు. ఎక్కడ తిరిగినా సక్కగ సమాధానం రావడం లేదు.

**-మందా వెంకటయ్య, రైతు, మంగళగూడెం, ఖమ్మం రూరల్**

### రేషన్‌కార్డు లేదని నా రుణమాఫీ ఆపేశారట..



మాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రెండేళ్ల కిందట టేకులపల్లి సొసైటీలో రూ.80 వేల పంట రుణం తీసుకున్నా. తొలి జాబితాలోనే నా పేరు రావాల్సి ఉంది. కానీ ఏ జాబితాలోనూ రాలేదు. దీంతో అధికారులను అడిగాను. రేషన్‌కార్డు లేదు కాబట్టి నా రుణ మాఫీ ఆపేశారని చెబుతున్నారు. రేషన్‌కార్డు లేనివాళ్ల గురించి ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంత వరకూ ఆగాలని అంటున్నారు. ఆ ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందో ఏమో? అసలు నా పంట రుణం మాఫీ అవుతుందో కాదో అర్థం కావడం లేదు.

**-గుడిపాటి వెంకటేశ్వర్లు, రైతు, తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్**

### అప్పుడే అప్పు కట్టా.. కానీ కట్టలేదని ఉందట..



గత కేసీఆర్ ప్రభుత్వంలో నాకు రుణమాఫీ వచ్చింది. రూ.9 వేల వరకు కట్టాల్సి ఉండగా ఏదులాపురం సొసైటీలో కట్టాను. రెండు బ్యాంకుల దగ్గర వద్దనుకొని కొన్నేళ్ల క్రితం కెనరా బ్యాంకులోనే రూ.1.50 లక్షల పంట రుణం తీసుకున్నా. కానీ నా రుణం మాఫీ కాలేదు. ఎందుకని అడిగితే సొసైటీలో కూడా అప్పున్నది కాబట్టి రుణ మాఫీ కాలేదని చెబుతున్నారు. దానిని అప్పుడే కట్టాను. కానీ కట్టనట్టుగా ధరణిలో చూపిస్తోందని చెబుతున్నారు. నేను సొసైటీ అప్పు కట్టగానే అక్కడ నా పేరును తొలగించకపోవడం వల్లనే నా రుణం మాఫీ కావట్లేదు.

**-మామిడి సుబ్బయ్య, రైతు, సత్యనారాయణపురం**

### ఆఫీసుల చుట్టూ తిరగాలంటే పానం పోతంది..



ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మా పంట రుణం మాఫీ చేయలేదు. ఎందుకు మాఫీ చేయలేదో తెలుసుకుందామని ఆఫీసుల చుట్టూ తిరగాలంటే పానం పోతంది. మాది మంగళగూడెం గ్రామం. నా కోడలు పేరు మీద, నా పేరు మీద పంట రుణాలు తీసుకున్నాం. ఇద్దరి రుణాలు కలిసి రూ.2 లక్షల వరకు ఉన్నాయి. కానీ మా రుణాలు మాఫీ కాలేదు. నెలరోజుల నుంచి తిరుగుతూనే ఉన్నా. పక్షపాతంతో నా పెనిమిటి ఇంటికే పరిమితమైండు. జ్వరం వల్ల కొడుకు లేవడం లేదు. మంగళగూడెంలో అడిగితే మండలానికి పొమ్మన్నారు. మండలానికి వచ్చి అడిగితే కామంచికల్ రైతు వేదికకు వెళ్లమన్నారు. అక్కడికి వెళ్లి అడిగా నా పేరు లేదన్నారు. కుటుంబంలో ఒక్కరికే రేషన్‌కార్డు ఉందని కాబట్టి రుణం మాఫీ కాలేదని అంటున్నారు.

**-కుసునూరి వెంకటమ్మ, మహిళా రైతు, ఖమ్మం రూరల్**

# కార్యకర్తలకు అండగా 'బీఆర్‌ఎస్'

**పార్టీ బీమా పరిహారం చెక్కు పంపిణీలో మాజీ మంత్రి అజయ్‌కుమార్**


ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం/ రఘునాథపాలెం, ఆగస్టు 23: బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం 14వ డివిజన్‌కు చెందిన మార్బుల్ వర్కర్ ఇసంపల్లి శ్రీనివాసరావు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. అప్పటికే అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉంది. దీంతో అతడి కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా పరిహారం కింద మంజూరైంది. ఈ మేరకు ఆ చెక్కును మాజీ మంత్రి అజయ్‌కుమార్ శుక్రవారం మృతుడి భార్య ఉపేంద్రమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ కూరాకుల వలరాజు, బీఆర్‌ఎస్ నాయకులు జానీ, రామనర్సయ్య, దస్తగిరి, కోటి, నాగరాజు, అశోక్, సతీశ్, వెంకన్న, శరత్ పాల్గొన్నారు.

# పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తున్నాం

- వనమహోత్సవ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ
- ఒక్కరోజే 235 మొక్కలు నాటిన బలరాంనాయక్

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 23: సింగరేణి సంస్థలో పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరాంనాయక్ పేర్కొన్నారు. ఇందుకోసం సంస్థ సమీప గ్రామాలు, మైన్లు, డిపార్ట్‌మెంట్లు, ఓబీ డంపుల్లో విరివిగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా 'ప్రతీ అడుగు పచ్చదనం' అనే నినాదంతో సింగరేణిలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో శుక్రవారం ఆయన 235 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై తమ సంస్థ మొదటి నుంచీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని, మొక్కలు నాటుతూ అడవులను పెంచుతోందని అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 2023 వరకు 14,680 హెక్టార్లలో 7.32 కోట్ల కుగాపై మొక్కలు నాటామని, ఈ ఏడాది 664 హెక్టార్లలో 13.30 లక్షల మొక్కలను పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. కాగా, సీఎండీ స్థాయి అధికారి ఒక్కరే ఒక్కరోజే 235 మొక్కలను నాటి అందరికీ ఆదర్శంగా నిలిచారంటూ స్థానిక అధికారులు ప్రశంసించారు. జీఎం వెంకటరమణ, ఏజీఎం (డబ్ల్యూ) వివేక్‌బాబు, డీజీఎం హరినారాయణ, రాజీవ్‌కుమార్, మేనేజర్ ఆర్‌బీ డేవీడ్ అభిలాష్ పాల్గొన్నారు.


కొత్తగూడెంలో మొక్కలు నాటుతున్న సింగరేణి సీఎండీ బలరాం

# ఖాళీల భర్తీ జరిగేనా?

- 'ఖమ్మం'లో ఖాళీగా 714 అంగన్‌వాడీ పోస్టులు
- అదనపు భారంతో అవస్థలు పడుతున్న టీచర్లు
- సేవలు పొందలేకపోతున్న గర్భిణులు, బాలింతలు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 23 : జిల్లాలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్)లో భారీగా ఖాళీలు ఉండడంతో లబ్ధిదారులు సరైన సేవలు పొందలేకపోతున్నారు. అలాగే మిగతా వారిపై భారీగా అదనపు భారం పడుతోంది. మాతృ శాఖ సేవలతోపాటు ఇతర పనుల బాధ్యతలనూ వీరు నిర్వహిస్తుంటారు. ఖాళీలు భర్తీ కాకపోవడంతో అటు సేవలకు, ఇటు విధులకు ఆటంకం కలుగుతోంది. ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లది క్షేత్రస్థాయిలో చాలా కీలకపాత్ర. ఒకవైపు సొంగ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించుకోవాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సహా పలు రకాల సేవలందించాలి. వైద్యారోగ్య శాఖ కార్యక్రమాల్లోనూ పాల్పంచుకోవాలి. చివరికి ఎన్నికల విధుల్లో క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులగానూ సేవలందించాలి. ఇన్ని రకాల విధుల్లో తలమునలవుతున్న వీరిపై ఈ ఖాళీల కారణంగా ఇంకా అదనపు పరిభారం పడుతోంది. దీంతో వీరి ఖాళీలు భర్తీ అయితే వీరికి పనిభారం తగ్గడంతోపాటు మెరుగైన సేవలూ అందే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్ వంటి అతి పెద్ద ప్రాజెక్టుల్లో సిబ్బంది కొరత మరింత తీవ్రంగా ఉంది. మరి కొద్ది రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూళ్లుగా, ప్రీ స్కూళ్లుగా మారుస్తామని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ఖాళీల భర్తీ ఆవశ్యకత ఎంతో ఉంది.

**ఖాళీల వివరాలు ఇలా..**

జిల్లా ఐసీడీఎస్ శాఖ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుతం 714 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1,840 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 1,723 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. 117 టీచర్ పోస్టులు కొద్ది రోజులుగా ఖాళీగా ఉన్నాయి. అలాగే, 1,840 మంది హెల్పర్లకుగాను కేవలం 1,243 మంది మాత్రమే ఉన్నారు. 597 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు | : | 1,840 |
| టీచర్ పోస్టుల ఖాళీలు | : | 117 |
| హెల్పర్ పోస్టుల ఖాళీలు | : | 597 |



ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం


# పనులను త్వరగా ప్రారంభించాలి


**మెడికల్ కాలేజీ భవనాన్ని వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలి : మంత్రి తుమ్మల**


మంత్రి దామోదర రాజనర్సింహాతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 23: ఖమ్మం మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఇందుకోసం పనులను త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం కలిసిన తుమ్మల.. పలు అంశాలతోపాటు ఖమ్మం వైద్య కళాశాల భవన నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. వైద్య కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేటాయించిన స్థలంలో అధునాతన సౌకర్యాలతో భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే, ఖమ్మం ప్రధానాసుపత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రోగుల సంఖ్య అధికంగా పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా వైద్యసిబ్బందిని పెంచాలని కోరారు.

# షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి


బోనకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు


నేలకొండపల్లిలో వ్యవసాయ అధికారులకు వినతిపత్రాన్ని ఇస్తున్న సీపీఎం నాయకులు

## బోనకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

బోనకల్లు, ఆగస్టు 23: ఎలాంటి షరతులూ లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బోనకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట, మండల వ్యవసాయ శాఖ కార్యాలయం శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రుణమాఫీ అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తలా ఒక ప్రకటన చేస్తున్నారని, పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. దీంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 లక్షల్లోపు రుణాలన్నింటినీ మాఫీ చేసినట్లు వైరా సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా ప్రకటించారని గుర్తుచేశారు. కానీ సహకార సంఘాల్లో రూ.లక్షలోపు రుణాలున్న రైతుల్లో ఇంకా వందలాది మందికి మాఫీ జరగలేదని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్‌కు, ఏవో కొండూరి విజయభాస్కర్‌రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఆ పార్టీ నాయకులు కందికొండ శ్రీనివాసరావు, చిట్టు మోదు నాగేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, జొన్నలగడ్డ సునీత తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి..

కూసుమంచి (నేలకొండపల్లి), ఆగస్టు 23: రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆ పార్టీ నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కేవీ రామిరెడ్డి, ఏటుకూరి రామారావు, రచ్చా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.